సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



టన్ను చీనీ రూ.31 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేలు పలికాయి. మార్కెట్‌కు 538 టన్నుల కాయలు వచ్చాయి.



కిలో టమాట రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ. 6, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

రంజాన్ వేళలు

ఆదివారం	సోమవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.36	సెహరీ : 4.56



న్యూస్‌రీల్

టీడీపీ నీటి రాజకీయం

- అనుకూల సిబ్బందితో అరాచకం
- శ్రీరామిరెడ్డి నీటి సరఫరాకు ఆటంకం
- నీటి ఉధృతికి కాలిపోయిన మోటార్లు



పంప్‌హౌస్‌లో నీటితో నిండిన మోటార్లు

కళ్యాణదుర్గం: ప్రజల్లో ఆదరణ లేని టీడీపీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవడం కోసం అడ్డదారులు తొక్కుతోంది. ఇందులో భాగంగా నీటి రాజకీయానికి తెరలేపింది. అనుకూలురైన సిబ్బందిని ఉసిగొలిపి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పంపుహౌస్‌లో మోటార్ల ధ్వంసానికి పాల్పడింది. కళ్యాణదుర్గంలోని శ్రీరామిరెడ్డి పథకం తాగునీటి సరఫరా పంప్ హౌస్‌లో శుక్రవారం రాత్రి టీడీపీ నాయకుల ప్రోద్బలంతో నలుగురు సిబ్బంది ఉద్దేశపూర్వకంగా పైపుల వాల్వ్‌లు ఆన్ చేశారు. దీంతో నీరంతా పంపుహౌస్ కింద ఉన్న మోటార్లలోకి చేరింది. మోటార్లన్నీ కాలిపోయాయి. నీటి ఉధృతికి పైపులు ధ్వంసమయ్యాయి. దాదాపు రూ.15 లక్షల మేర నష్టం వాటిల్లింది. శనివారం సాయంత్రం పంపుహౌస్‌ను ఈఈ జవహర్‌కుమార్, డీఈ శ్రీనివాసులు, జేఈ లావణ్య, కాంట్రాక్టర్ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. ఫేజ్-1కు సంబంధించిన మూడు మోటార్లు కాలిపోయినందున కళ్యాణదుర్గంతో పాటు హిందూపురం, మడకశిర నియోజకవర్గాలకు నీటిసరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు చర్యలు చేపడతామని తెలిపారు. ఇదిలా ఉండగా పంప్‌హౌస్‌లో జరిగిన ఘటనపై పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజల్లో వ్యతిరేకత తేవాలని కుట్ర

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్యకు నియోజకవర్గంలో ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా పాటుపడుతున్నారు. అయితే శ్రీరామిరెడ్డి నీటి పథకం మోటార్లు పనిచేయకుండా.. తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలిగించి.. ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీకి ఆపాదించాలని టీడీపీ నేతలు కుట్రలు పన్నినట్లు తెలుస్తోంది. ఉగాది పండుగ వేళ నీటి సరఫరాకు ఇబ్బంది కలిగిస్తే... టీడీపీ అభ్యర్థి సురేంద్రబాబు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసి ప్రజలకు దగ్గరవ్వాలనే ఎత్తుగడతోనే ఇలా చేస్తున్నారని తెలుస్తోంది.

అందుబాటులో హాల్ టికెట్లు

చిలమత్తూరు: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల వసతి గృహాల్లో ప్రవేశం పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల హాల్ టికెట్లు అందుబాటులో ఉన్నాయి. http://mjpapbcwreis.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టేకులోడు క్రాస్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్యాంభూపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 13న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

పోలీసుల కవాతు



శిరివరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

లేపాక్షి: మండలంలోని పులమతి, మద్దిపి, శిరివరం గ్రామాల్లో శనివారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలను అప్రమత్తం చేయడానికి కవాతు నిర్వహించినట్లు రూరల్ సీఐ ఈరన్న, ఎస్‌ఐ గోపి తెలిపారు.

నిన్ను నమ్మం బాబూ!

హామీలిచ్చి.. అందర్నీ ముంచి..

- 2014లో ఒక్క హామీనీ నిలబెట్టుకోలేని చంద్రబాబు
- చిత్తు కాగితాలుగా మారిన రుణ హామీ పత్రాలు
- డ్వాక్రా రుణాలు మాఫీ కాక డిఫాల్టర్లుగా మారిన వైనం
- ఇంటికొకటి కాదు ఊరికొక్క ఉద్యోగమూ ఇవ్వని దుస్థితి
- తాజాగా సూపర్ సిక్స్ పథకాలంటూ టీడీపీ కరపత్రాలు
- ఆ కరపత్రాలను చెత్తబుట్టలో వేస్తున్న ప్రజలు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో బాబు హామీలంటే భయపడుతున్న జనం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అధికారం కోసం అలవికాని హామీలు ఇవ్వడం.. అమలు చేయకుండా ప్రజలను దగా చేయడం చంద్రబాబు నైజం. ఆయన గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలే ఇందుకు నిదర్శనం. ఆయన మాటలు నమ్మి కంతులు చెల్లించని డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా ముద్ర పడ్డారు. రుణ మాఫీ అవుతుందని, బ్యాంకుల్లోని బంగారు ఆభరణాలు ఇంటికి వస్తాయని ఆశించిన రైతులకు భంగపాటే ఎదురైంది. గడువు ముగిసినా రుణాలు చెల్లించలేదంటూ బ్యాంకర్ల నుంచి నోటీసులు అందడంతో అవమానభారంతో కుంగిపోయారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు వందలాది హామీలు అమలు కాలేదు. ఇప్పుడు ఎన్నికల మేనిఫెస్టోలో కనీవినీ ఎరుగని రీతిలో 99 శాతం హామీలు అమలు చేసి ప్రజల్లో ఆదరణ, విశ్వాసం చూరగొన్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. కూటమి తరఫున టీడీపీ ఇస్తున్న హామీలను ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎవ్వరూ నమ్మడం లేదు. హామీల కరపత్రాలను చెత్తబుట్టల్లోకి పడేస్తుండటంతో టీడీపీ అభ్యర్థుల్లో కలవరం మొదలైంది.

10 లక్షల మందికి పైగా రైతులకు మోసం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పూర్తిగా రుణమాఫీ చేస్తానని, బ్యాంకుల్లోని మీ బంగారం విడిపిస్తానని, ఒక్కపైసా కూడా కట్టొద్దని నాడు చంద్రబాబు చెప్పారు. దీనికోసం 2015-16లో రుణ హామీ పత్రాలు ఇచ్చారు. కానీ 2019 దాకా ఒక్క పైసా కట్టకపోవడంతో రైతులందరూ బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా మారారు. అందరికీ నోటీసులొచ్చాయి. దీంతో ఆస్తులు తాకట్టుపెట్టి రుణాలు కట్టారు.

డ్వాక్రా మహిళలకు కోలుకోలేని దెబ్బ

అనంతపురం జిల్లాలో డ్వాక్రా మహిళలకు చంద్రబాబు హయాంలో కోలుకోలేని దెబ్బపడింది. డ్వాక్రా రుణాలు మొత్తం మాఫీ చేస్తానని హామీ ఇవ్వడంతో 2014లో బాబుకు ఓట్లేశారు. బాబు మాటలు నమ్మి కంతులు చెల్లించకపోవడం, రుణాలు మాఫీ కాకపోవడంతో చాలామంది మహిళలకు బ్యాంకుల నుంచి నోటీసులు వచ్చాయి. 2019 చివరిలో పసుపు- కుంకుమ కోసం అంటూ ఎన్నికల తాయిలంగా రూ.10 వేలు వేశారు. చంద్రబాబు పుణ్యమా అని ఏ గ్రేడులో ఉన్న పొదుపు సంఘాలు డీ గ్రేడ్‌కు పడిపోయాయి. బ్యాంకర్ల దృష్టిలో డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన రుణాలు నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) జాబితాలో చేరాయి.

ఇంటికొక ఉద్యోగం పెద్ద మాయ

అనంతపురం జిల్లాలో 2019కి ముందు ఉపాధి కోసం భారీగా వలసలుండేవి. 2014లో ఇంటికో ఉద్యోగం ఇస్తానని బాబు హామీ ఇచ్చారు. కానీ ఊరికొక ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారు. జాబు రావాలంటే బాబు రావాలని చెప్పారు. ఎన్నికల్లో గెలిచాక ఆ హామీనే విస్మరించారు. కాపులకు రిజర్వేషన్ అని అదీ మర్చిపోయారు. ముస్లింలకు ప్రధాన నగరాల్లో హజ్‌హౌస్‌ల నిర్మాణం చేపడతామని, రూ.5 లక్షల వడ్డీలేని రుణాలు ఇస్తామని, ఆదాయం లేని మసీదులలో ఇమామ్, మౌజన్లకు రూ.5 వేలు ఇస్తామని చెప్పి ఏ ఒక్కటీ ఇవ్వలేదు. ఇక దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేరుస్తామని, ప్రతి జిల్లాలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు నిర్మిస్తామని చెప్పి మిన్నకుండిపోయారరు.

'సూపర్ సిక్స్'తో సరికొత్త మోసం

టీడీపీ అధినేత చంద్రబాబు 'సూపర్ సిక్స్' పథకాలంటూ మళ్లీ ఎన్నికల హామీలు ఇస్తున్నప్పటికీ ఎక్కడా స్పందన కనిపించడం లేదు. పింఛన్ ఏప్రిల్ నుంచే పెంచి ఇస్తామన్నా జనం నమ్మడం లేదు. ఓ వైపు వలంటీర్ల ద్వారా ఇంటిదగ్గరకే వచ్చి ఇస్తున్న పింఛన్ల పంపిణీని అడ్డుకున్న బాబు కుట్రలపై ఉమ్మడి అనంతపురం జిల్లాలో పింఛన్‌దారులు మండిపడుతున్నారు. తెలుగుదేశం అభ్యర్థులు సూపర్ సిక్స్ పథకాలతో పట్టణాలు, పల్లెల్లో ప్రచారం చేస్తున్నా.. ఆ కరపత్రాలను ప్రజలు వెంటనే చెత్తబుట్టలోకి వేస్తున్నారు.

మేనిఫెస్టోనే మాయం చేశాడు



అలివిగాని హామీలిచ్చి గద్దెనెక్కాక అన్ని వర్గాలను దగా చేసిన ఘనుడు చంద్రబాబు. 650 హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకుండా ఏకంగా మేనిఫెస్టోనే మాయం చేశాడు. రుణ మాఫీ పేరుతో రైతులు, డ్వాక్రా మహిళలకు ఆశపెట్టాడు. అధికారంలోకి వచ్చాక మాట నిలుపుకోకపోవడంతో బ్యాంకుల నుంచి నోటీసులు వచ్చాయి. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి నిరుద్యోగులకూ కుచ్చుటోపీ పెట్టాడు. చంద్రబాబు మాటలు నమ్మితే నట్టేట మునిగినట్టే. – బోగే రాజశేఖర్ రెడ్డి, ఈదులపల్లి, ముదిగుబ్బ మండలం

హామీలన్నీ గంగలోకే



చంద్రబాబు ఏ హామీ ఇచ్చినా అది గంగలోకే. తాను సీఎం అయిన వచ్చిన వెంటనే మడకశిర నియోజకవర్గంలోని అన్ని చెరువులనూ కృష్ణాజలాలతో నింపుతానని, మడకశిర ప్రాంతంలోని పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తానని..ఇలా 2014 ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చాడు. అధికారంలోకి వచ్చాక ఒక్కటంటే ఒక్కటీ నెరవేర్చలేదు. – నారాయణస్వామి, భీమరాయనపల్లి, మడకశిర మండలం

బాబును నమ్మి నిండా మునిగాం



2014లో చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో రైతు, డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని హామీ ఇస్తే నమ్మాం. రుణమాఫీ అవుతుందన్న ఆశతో నేను బ్యాంకులో తీసుకున్న క్రాప్‌లోన్ కట్టలేదు. అలాగే మా ఆవిడ డ్వాక్రా సంఘం ద్వారా తీసుకున్న రుణమూ చెల్లించలేదు. కానీ అధికారంలోకి వచ్చాక చంద్రబాబును రుణమాఫీనే పట్టించుకోలేదు. దీంతో వడ్డీ అసలు కలిపి రెండింతలు కట్టాం. జగన్‌మోహన్‌రెడ్డి అలా కాదు. మాటిచ్చాడంటే నెరవేరుస్తాడు. – అశ్వర్థనారాయణ, చిన్నబోయనపల్లి, కొత్తచెరువు

నమ్మితే అంతే సంగతులు



చంద్రబాబు 2014 అధికారంలోకి రావటానికి రైతు రుణాలన్ని భేషరతుగా మాఫీ చేస్తానని చెప్పాడు. కానీ అధికారంలోని వచ్చాక ఆ హామీని తుంగలో తొక్కాడు. మాలాంటి రైతులకు ఎవరికీ రుణాలు మాఫీ కాలేదు. బ్యాంకు వాళ్లు నోటీసులు పంపగా వడ్డీలు కట్టలేక చచ్చాం. ఆయన్ను నమ్మినందుకు అన్ని విధాలా నష్టపోయాం. ఇప్పుడు అధికారం కోసం ఎన్నెన్నో హామీలిస్తున్నాడు. మళ్లీ నమ్మితే అంతేసంగతులు. – నాగమ్మ, కల్లూరు, లేపాక్షి మండలం

'పురం' పదేళ్లుగా అభివృద్ధిలో వెనకబడింది



మాట్లాడుతున్న పరిపూర్ణానంద స్వామి

హిందూపురం: 'పదేళ్లుగా హిందూపురం వాసులు ఒకే పార్టీని గెలిపిస్తూ వస్తున్నారు. అయినా ఇక్కడ ఏం అభివృద్ధి జరిగింది. ఎక్కడున్నాం మనం.. ప్రజలు ఆలోచించాలి. అభిమానం తప్పుకాదు... గుడ్డి నమ్మకం వెనుకబాటు తనం అవుతుంది..పదేళ్లుగా హిందూపురం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడి ఉంది'' అని పరిపూర్ణానందస్వామి అన్నారు. శనివారం ఆయన నానెప్పనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధిష్టానం హిందూపురం ఎంపీ స్థానంపై మరోసారి తప్పకుండా ఆలోచిస్తుందని, ఉగాదికి శుభవార్త వస్తుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. తన సప్తపది అంశాల్లో మూడవ అంశంగా విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. హిందూపురం అభివృద్ధే తన సంకల్పమన్నారు.

ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏతో సహా 200 మందిపై కేసు

చిలమత్తూరు: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన అంశంలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ శ్రీనివాసరావుతో సహా 200 మందిపై చిలమత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నరసింహస్వామి దేవాలయం వద్ద పార్టీలో చేరికల కార్యక్రమం నిర్వహించారు. గుడి, బడి సమీపంలో ప్రచారం నిర్వహించకూడదన్న నిబంధనలు ఉల్లంఘించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఎంపీడీఓ రాంకుమార్ శుక్రవారమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంసీసీ నిబంధనలు ఉల్లంఘించిన ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ శ్రీనివాసరావు, ఇటీవలే ఎన్నికల ప్రచారంలో పాల్గొని సస్పెండైన ఉపాధ్యాయుడు రంగారెడ్డి సహా రెండు వందల మందిపై ఎస్‌ఐ గంగాధర్ శనివారం కేసు నమోదు చేశారు. కోడ్ ఉల్లంఘనలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హెచ్చరించారు.



ఉదయం 11 గంటలకే నిర్మానుష్యంగా మారిన పుట్టపర్తి పట్టణంలోని చిత్రావతి రోడ్డు



ఎండ నుంచి ఉపశమనం కోసం ఈత కొడుతున్న చిన్నారులు



హీట్‌వేవ్‌పై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు (ఫైల్)

భానుడి భగభగలు

- చెన్నేకొత్తపల్లిలో 43.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు
- ఉదయం 9 నుంచే ప్రతాపం చూపుతున్న సూరీడు
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న యంత్రాంగం

పుట్టపర్తి టౌన్: భానుడి భగభగలు మరింత ఉగ్రరూపం దాల్చాయి. ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ మొదట్లోనే సూరీడు తీవ్రస్థాయిలో ప్రభావం చూపిస్తున్నాడు. గరిష్ట ఉష్ణోగ్రతలు, ఉక్కపోత, వడగాల్పులతో శ్రీసత్యసాయి నిప్పులకొలిమిలా తయారైంది. శనివారం కూడా చెన్నేకొత్తపల్లిలో 43.8 డిగ్రీలు గరిష్టం నమోదు కాగా, కదిరి 43.5 డిగ్రీలు, ధర్మవరం 43.3, పుట్టపర్తి, ముదిగుబ్బ 43, బత్తలపల్లి, రొద్దం, తలుపుల 42.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా ప్రాంతాల్లోనూ గరిష్ట ఉష్ణోగ్రతలు 39 నుంచి 42 డిగ్రీల మధ్య, కనిష్ట ఉష్ణోగ్రతలు 19 నుంచి 26 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.

10 గంటలకే ఉగ్రరూపం..

మార్చి చివరి వారంలోనే రికార్డుస్థాయిలో నమోదవుతున్న ఎండలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు కూడా రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఉదయం 10 గంటలకే భానుడు ఉగ్రరూపం చూపుతుండగా జనం అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ నెలలోనే ఇలా ఉంటే... మే నెలలో పరిస్థితి ఏమిటో అనుకుంటూ జనం ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని వివిధ పట్టణాల్లో ప్రధాన రహదారులన్నీ 12 గంటల తర్వాత నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేసవి నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నారులు బావులు, చెరువుల్లో ఈత కొట్టేందుకు ఉత్సాహం చూపుతున్నారు.



జాగ్రత్తలు తప్పనిసరి..

జిల్లా వ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. తరచూ నీళ్లు తాగాలని సూచిస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం బయట తిరిగే వారు ఎక్కువగా కొబ్బరి నీళ్లు, నిమ్మరసం వంటివి సేవిస్తూ ఉండాలని, అవసరాన్ని బట్టి ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలని సూచిస్తున్నారు. తెలుపు, లేత రంగుల్లో ఉన్న పలుచని కాటన్ దుస్తులు ధరించాలని, తలకు ఎండ తగలకుండా టోపీ, రుమాలు చుట్టుకోవాలని ప్రజలకు వివరిస్తున్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు..

ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా ప్రతి బస్టాండ్, రైల్వేస్టేషన్, ముఖ్యమైన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటుకు సిద్ధమైంది. అలాగే స్వచ్ఛంద సంస్థలు, పట్టణ ప్రముఖులతో ఉచిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటోంది. అలాగే ఉపాధిహామీ పథకం కార్మికులు ఉదయం సాయంత్రం మాత్రమే పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. చిన్నారులు, బాలింతలు, వృద్ధుల వీలైనంత వరకూ బయటకు వెళ్లకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

చేరికల వెల్లువ

జనానికి మంచి చేయని జెండాలన్నీ జత కట్టాయి. అధికారమే పరమావధిగా కుట్రలు చేస్తున్నాయి. జనహితమే అభిమతంగా పాలన సాగిస్తున్న జగన్‌ను టార్గెట్ చేశాయి. కానీ ప్రజలు మాత్రం జనరంజక పాలనకు పట్టం కడుతున్నారు. ఊరూవాడా ఏకమై జననేతకు జై కొడుతున్నారు. కూటమి కుట్రలు నచ్చని ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలూ 'ఫ్యాన్స్'గా మారుతున్నారు. జగన్ పాలనకు మద్దతు పలుకుతూ వన్స్‌మోర్ వైఎస్సార్ సీపీ అంటూ జనంలోకి దూసుకెళ్తున్నారు.



హిందూపురం నియోజకవర్గం లేపాక్షి మండలం బిసలమానేపల్లిలో మిరప రైతులను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక



మడకశిర మండలం ఆమిదాలగొందిలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ, జనసేన, కాంగ్రెస్ వర్గీయులు

ఫ్యాన్ ఫుల్ స్పీడ్

- ఖాళీ అవుతోన్న ప్రతిపక్ష పార్టీలు
- వార్డుల వారీగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్న వైనం
- జిల్లాలో కనిపించని జనసేన జెండా
- ఒక్క సీటుతో గందరగోళంలో బీజేపీ
- గ్రూపులు నివారించలేని స్థితిలో టీడీపీ
- రోజురోజుకూ రచ్చకెక్కుతున్న తగాదాలు

సాక్షి, పుట్టపర్తి

'అధికార పార్టీకి తిరుగు లేదు. మరోసారి విజయం ఖాయం. జగనన్నను గెలిపిస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయి. ఇంటి వద్దకే పింఛన్ వస్తుంది. ప్రతి పథకానికి సంబంధించిన డబ్బులు బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయి. లంచం ఉండదు... వివక్ష లేదు. అర్హత ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తోన్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి' ప్రస్తుతం ఎక్కడకు వెళ్లినా వినిపిస్తున్న మాటలివి. అందువల్లే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఊరువాడా బ్రహ్మరథం పడుతున్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలూ వైఎస్ జగన్ అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. బీజేపీ – జనసేనతో టీడీపీ జత కట్టడంతో మూడు పార్టీల మధ్య సఖ్యత కుదరక ఆయా పార్టీల్లోని కార్యకర్తలు అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు.

గుర్తింపు లేక... పొత్తులు నచ్చక..

ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ విధానాలు నచ్చక.. బీజేపీ – జనసేన వెంట తిరగలేక.. మూడు పార్టీల మధ్య సఖ్యత లేక ఆయా పార్టీల కార్యకర్తలు అధికార పార్టీ వైపు చూస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం చేసినా.. చంద్రబాబు గుర్తించలేదని చాలా మంది వాపోతున్నారు. ఇక జనసేనకు జిల్లాలో ఒక్క సీటు కేటాయించకపోవడంతో ఆ పార్టీ నేతలు జెండా దించేశారు. అక్కడక్కడా ఉన్న జనసేన నాయకులూ వైఎస్సార్ సీపీ కండువా కప్పుకున్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఏ నియోజకవర్గంలోనూ జనసేన జెండా కనిపించడం లేదు. అదేవిధంగా బీజేపీకి ధర్మవరం సీటు కేటాయించినా పరిస్థితిలో మార్పులేదు. స్థానికేతరుడైన సత్యకుమార్ అభ్యర్థిత్వాన్ని బలపర్చలేక చాలామంది బీజేపీ నేతలు వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. అలాగే ధర్మవరంలోని టీడీపీ నేతలూ బీజేపీ విజయానికి తామెందుకు పనిచేయాలంటూ ముఖం చాటేశారు.

రచ్చకెక్కుతున్న తగాదాలు..

ఎన్నికల వేళ టీడీపీలో గ్రూపు విభేదాలు తారస్థాయికి చేరాయి. ఏ నాయకుడు చెప్పినా ఏ ఒక్కరూ వినే పరిస్థితి లేదు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో క్రమశిక్షణ చర్యలు తీసుకోలేని దుస్థితిలో అధిష్టానం ఉంది. ఫలితంగా ఏ అసెంబ్లీ పరిధిలో చూసినా ఇద్దరు, ముగ్గురు నాయకులు పెత్తనం చేస్తున్నారు. ఈనేపథ్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలందరు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఈనేపథ్యంలో టికెట్ దక్కించుకున్న వ్యక్తికి సహకరించేవారే కరువయ్యారు. దీంతో టీడీపీ అభ్యర్థులు డీలా పడ్డారు. కూటమిలో మిత్రపక్షాలైన బీజేపీ, జనసేన నుంచి సహకారం కూడా కరువైంది.

సర్వేలన్నీ.. వైఎస్సార్‌సీపీ వైపే..

ఇప్పటివరకు విడుదలైన సర్వేలన్నీ వైఎస్సార్ సీపీకి ఏకపక్షంగా తీర్పు ఇచ్చాయి. జిల్లాలో ఏ ఒక్కరిని కదిలించినా.. పేదల పాలిట దేవుడు వైఎస్ జగన్ అనే సమాధానం చెప్పడంతో పాటు మరోసారి గెలిపించుకుంటామని చెబుతున్నారు. దీంతో వైఎస్సార్ సీపీలో చేరికలు మరింత ఊపందుకున్నాయి.

క్లుప్తంగా

భక్తరపల్లి ఆలయ హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి గ్రామంలో కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామికి భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. హుండీ కానుకల ద్వారా రూ.10,44,155 ఆదాయం వచ్చినట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు. రెండు రోజుల లెక్కింపులో భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి దేవాలయాల హుండీల ద్వారా రూ.20,75,582 లక్షల ఆదాయం వచ్చింది. ఈ హుండీ కానుకల లెక్కింపులో దేవాదాయశాఖ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నగదు స్వాధీనం



నగదును చూపుతున్న అధికారులు

ధర్మవరం అర్బన్: ఎలాంటి బిల్లు లేకుండా డబ్బులు తీసుకెళుతున్న ఓ వ్యక్తి దగ్గర నుంచి రూ.92 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, డీఈఈ లోకన్న తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన వేణుగోపాల్ దగ్గర ఆధారాలు లేకుండా రూ.92 వేలు నగదు ఉండటంతో స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

రూ.3.40 లక్షల స్వాధీనం

హిందూపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో హిందూపురం పట్టణంలోని ఆజాద్‌నగర్‌లో స్పెషల్ పార్టీ పోలీసులు శనివారం తనిఖీలు చేశారు. ఇందులో భాగంగానే ఆధారాలు లేకుండా రూ.2.20 లక్షలను ఓ వ్యక్తి తరలిస్తుండగా నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే లేపాక్షి మండలం చోళసముద్రం వద్ద తనిఖీల్లో రూ.1.20 లక్షల స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



కదిరి గాంధీ నగర్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



ఆధునిక వైద్య పరికరాలతో ఉన్న ల్యాబ్

ఆరోగ్యమస్తు!

- వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లతో పట్టణ పేదల వైద్యానికి భరోసా
- జిల్లా వ్యాప్తంగా వైద్య సేవలు అందిస్తున్న 18 అర్బన్ హెల్త్ క్లినిక్‌లు
- అందుబాటులో ఆధునిక వైద్య పరికరాలు
- ఉచితంగా 60 రకాల వైద్య పరీక్షలు

ప్రశాంతి నిలయం: పేదల ఆరోగ్యానికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ముఖ్యంగా పట్టణ పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేలా వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసింది. గతంలో జ్వరం, జలుబు, దగ్గు ఇలా ఎంత చిన్న రోగం వచ్చినా రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వచ్చేది. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడే వారు తరచూ రక్త పరీక్షలు, మందుల ఖర్చు తడిసి మోపెడయ్యేది. ఇలాంటి బాధల నుంచి పట్టణ పేదలకు విముక్తి కల్పిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించేలా పూర్తి ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు అందించేలా ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా పట్టణ ప్రాంతాలలో 18 హెల్త్ సెంటర్లు ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు.

30 వేల మంది జనాభాకు ఒకటి..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 18 వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి వైద్య సేవలను అందిస్తున్నారు. జిల్లాలోని ధర్మవరంలో -6, కదిరిలో-4, హిందూపురంలో -5, పెనుకొండ -1, పుట్టపర్తి-1, మడకశిరలో-1 అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా పేదలకు వైద్య సేవలు అందుతున్నాయి. పట్టణాల్లో ప్రతి 30 వేల మంది జనాభాకు ఒక అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ప్రతి సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ ఆపరేటర్, నాలుగో తరగతి ఉద్యోగి సేవలు అందిస్తున్నారు. స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ఇటీవల కాలంలో చెవి, ముక్కు,గొంతు, చర్మ వ్యాధులు, ఎముకలు, కీళ్ల సంబంధిత, ప్రసూతి వైద్య నిపుణులను సైతం నియమించి సేవలు అందేలా చూస్తున్నారు. అలాగే టెలీ మెడిసిన్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. జనరల్ మెడిసిన్, గైనిక్, పీడియాట్రిక్ వైద్యులను సంప్రదిస్తూ వైద్య సూచనలను సైతం ఇస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఉచితంగా 60 రకాల వైద్య పరీక్షలు..

ప్రతి అర్బన్ సెంటర్‌లో రోగులకు పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో బయోకెమిస్ట్రీ అనలైజర్, హెమటాలజీ అనలైజర్, యూరిన్ అనలైజర్, ఎలక్ట్రోలైట్ అనలైజర్, హిమోగ్లోబిన్ మీటర్, గ్లూకో మీటర్ వంటి యంత్రాలను అందుబాటులో ఉంచారు. వీటి ద్వారా రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు వంటి 60 రకాల పరీక్షలను ఉచితంగా అందిస్తున్నారు. సుమారు 216 రకాలకు పైగా మందులను సైతం అర్బన్ హెల్త్ సెంటర్లలో అందుబాటులో ఉంచి ఉచితంగా అందిస్తున్నారు. రోజూ ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా 80 నుంచి 100 మంది ఓపీ సేవలను పొందుతున్నారని వైద్యాధికారులు చెబుతున్నారు. ప్రారంభంలో ఆ సంఖ్య 20 నుంచి 30 దాకా ఉండేదని, అయితే , ప్రభుత్వం స్పెషలిస్ట్ వైద్యుల నియామకంతో పాటు ఉచితంగా మందుల పంపిణీ, వైద్య పరీక్షలు నిర్వహిస్తుండటంతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందంటున్నారు.

ఎప్పుడూ చూడలేదు



గతంలో దగ్గు, జ్వరం, జలుబు వంటివి వచ్చినా ప్రైవేటు ఆస్పత్రుకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ పరీక్షల పేరుతో వేలకు వేలు ఖర్చయ్యేవి. ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్ల ఏర్పాటు చేయడంతో మాలాంటి పేదలకు ఎంతో మేలు జరుగుతోంది. అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. చిన్న చిన్న రోగాలకు మంచి వైద్యం అందిస్తూ మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు. ఈ ప్రభుత్వం వైద్యంపరంగా అందిస్తున్న మేలును మరువలేము.

–గూండా ఈశ్వరయ్య, గాంధీనగర్, ధర్మవరం

నాణ్యమైన వైద్యసేవలే లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా 18 అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశాము. రోజూ ఉదయం 9 నుంచి 5 వరకు వైద్య సేవలు అందిస్తున్నారు. బీపీ, షుగర్ వంటి 60 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. మందులను సైతం ఉచితంగా ఇస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో పేదకు సౌకర్యవంతంగా వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్వీ కృష్ణారెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ

రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

ధర్మవరం రూరల్: వాహనాల తనిఖీల్లో భాగంగా పోతుకుంట దగ్గర మహేంద్ర మ్యాక్సీ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 26 సంచులు (1250 కేజీలు) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ నరేంద్ర తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీదేవికి అప్పగించామన్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనంతో పాటు ఒకరిని అదుపులోకి తీసుకొన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కొలేపల్లి వద్ద శనివారం జాతీయరహదారి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. మృతుడి వయసు సుమారు 45 ఏళ్లు ఉండచ్చని పోలీసులు చెబుతున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం

తలుపుల: మండలంలోని కే.రెడ్డివారిపల్లికి చెందిన కే.లలిత (18) శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించడంలేదని శనివారం యువతి తండ్రి రాజు ఫిర్యాదు చేశారని హెడ్ కానిస్టేబుల్ గుర్రప్ప తెలిపారు. లలిత అనంతపురంలో నర్సింగ్ చదువుకుంటోందని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీ ఆలయం



భక్తులతో కిటకిటలాడుతున్న ఖాద్రీ ఆలయం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి నృసింహుడిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయ ఈఓకు సన్మానం: భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసినందుకు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డిని శ్రీమద్ భగవద్గీత ఆత్మీయ సమ్మేళన సభ్యులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మరోవైపు బ్రహ్మోత్సవాలు జరిగిన 15 రోజుల పాటు ఆత్మీయ సమ్మేళన సభ్యులు భగవద్గీత పారాయణం చేయడంపై ఈఓ హర్షం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



విష్ణువర్ధన్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: కష్టపడి చదివి తమకు కుమారుడు ఆసరాగా ఉంటాడనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. విధి చిన్న చూపు చూడటంతో వారి బిడ్డ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. వివరాల్లోకి వెళితే .. ఆత్మకూరు మండలం ముట్టాల గ్రామానికి చెందిన కేశవరెడ్డి, వరాలు అనే దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి (19) అనంతపురంలో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవల ఇంటర్ పరీక్షలు ముగించుకొని సెలవులపై ఇంటికి వచ్చాడు. మూడు రోజుల్లో ఉగాది పండుగ ఉండటంతో శనివారం ఇల్లు కడిగేందుకు సిద్ధమయ్యారు. తల్లిదండ్రులకు విష్ణువర్ధన్‌రెడ్డి కూడా సాయం చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ నేపథ్యంలోనే విద్యుత్ మోటర్ ఆన్ చేసే సమయంలో విష్ణువర్ధన్‌రెడ్డి విద్యుదాఘాతానికి గురయ్యాడు. తల్లిదండ్రులు వెంటనే అతన్ని ఆత్మకూరుకు ఆస్పత్రి తీసుకెళ్లారు. వైద్యులు చికిత్స అందించి వెంటనే అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడికెళ్లేందుకు సిద్ధమవుతుండగా అంతలోనే పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు నిర్జీవంగా పడి ఉండటం చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి..

విష్ణువర్ధన్‌రెడ్డి విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ముట్టాలకు చేరుకొని విష్ణువర్ధన్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

‘ఎంపీపీ పదవికి రాజీనామా చేసి మాట్లాడు’



విలేకరులతో మాట్లాడుతున్న బీసీ నాయకులు

ముదిగుబ్బ: వైఎస్సార్‌సీపీ పెట్టిన భిక్షే ఎంపీపీ పదవి, ఆ పదవికి రాజీనామా చేసి మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు మల్లగుండ్ల భాస్కర్, మల్లికార్జున, శివశంకర... ఎంపీపీ ఆదినారాయణపై ధ్వజమెత్తారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ ఆదినారాయణ వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేస్తున్నానని, బీసీలకు వైఎస్సార్‌సీపీలో న్యాయం జరగలేదని సీఎం జగన్‌తో పాటు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని కూడా తక్కువ చేసి మాట్లాడడం సరికాదన్నారు. ఆయన స్థాయికి మించి మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ తరపున బీసీకి ఎంపీపీ సీటు కేటాయించడం ఒక ఎత్తయితే, నీ ఊరు కాని చోట నిన్ను నిలబెట్టి ఎంపీటీసీగా గెలిపించి ఎంపీపీని చేసింది కేతిరెడ్డి కాదా అని ప్రశ్నించారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన జగనన్నను విమర్శించడం తగదన్నారు. చీము, రక్తం, సిగ్గు, లజ్జ ఉంటే ముందుగా ఎంపీపీ పదవికి రాజీనామా చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అయితే, నియోజకవర్గంలో తనదైన శైలిలో పని చేస్తూ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. స్థానికేతరుడైన సత్యకుమార్‌కు బీజేపీ టికెట్ ఇస్తే మద్దతు ఇవ్వడానికి ప్రజలు ఏమైనా అమాయకులా? అని అన్నారు. నాయకులు మునిచంద్ర, చంద్రాయుడు, ఎల్ఐసీ రమణ, గోపాల్, రామక్రిష్ణ, వెంకటరమణ, శంకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన ఇద్దరిని అనంతపురం కలెక్టర్ వి.వినోద్‌కుమార్ శనివారం సస్పెండ్ చేశారు. గార్లదిన్నె మండలం ఇల్లూరు గ్రామ వలంటీరు పి.రమేష్, యాడికి మండలం రాయలచెరువు–7 అంగన్‌వాడీ వర్కర్ పి.అనసూయ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇదిలా ఉండగా... ఎఫ్ఎస్, ఎస్ఎస్ టీముల ద్వారా ఇప్పటి వరకు రూ.2,05,00,563 నగదు సీజ్ చేశారు.

రూడ్‌సెట్‌లో ఉచిత టైలరింగ్ శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో గ్రామీణ నిరుద్యోగ మహిళలకు ఉచితంగా టైలరింగ్, బ్యూటీ పార్లర్ శిక్షణ కల్పిస్తున్నట్లు డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 20 నుంచి 30 రోజుల పాటు శిక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి కల్పిస్తామని తెలిపారు. అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలకు చెందిన వారై 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళా నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లను సెల్ నంబర్ 9618876060, 9440905479 లను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



జార్ఖండ్ బాలవికాస్ విద్యార్థుల నృత్య ప్రదర్శన

ప్రశాంతి నిలయం: సత్యసాయిపై భక్తితో తమ సాంస్కృతిక కళా వైభవాన్ని చాటుతూ జార్ఖండ్ భక్తులు నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన జార్ఖండ్ భక్తులు శనివారం సాయంత్రం సాయి కుల్వంత్ సభా మందిరంలో సత్య సాయి మహా సమాధి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాలవికాస్ చిన్నారులు జార్ఖండ్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నృత్య ప్రదర్శన ఇచ్చారు.

లబ్ధిదారులందరూ స్టార్ క్యాంపెయినర్లే

- ఉమ్మడి ‘అనంత’ జిల్లాలో అన్నిస్థానాలు వైఎస్సార్‌సీపీవే..
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులందరూ జగనన్నకు స్టార్ క్యాంపెయినర్లేనని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం అనంతపురం నగర శివారులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రభుత్వం ఒక్క ఉద్యోగమైనా ఇచ్చిందా అని చంద్రబాబు ప్రశ్నించారన్నారు. అయితే తాజాగా ఆయన నోటి ద్వారానే జగన్ 1.60 లక్షల మందికి సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించారు. వారితో పింఛన్లు ఇప్పించమనండి అని చెప్పడం చూస్తుంటే ఇది జగనన్న నమ్మిన దేవుడి స్క్రిప్ట్ అన్నారు. వలంటీర్లు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులను స్టార్ క్యాంపెయినర్లుగా మార్చింది చంద్రబాబే అన్నారు. మొత్తం మీద జగనన్నకు అతి పెద్ద క్యాంపెయినర్ చంద్రబాబేనని పేర్కొన్నారు. పింఛన్లు తీసుకునేందుకు సచివాలయాలకు వెళ్లిన వారిలో రాష్ట్ర వ్యాప్తంగా 46 మందికి పైగా వడదెబ్బకు మృతి చెందారన్నారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇవ్వకూడదంటూ చంద్రబాబు బినామీ నిమ్మగడ్డ రమేష్‌కు చెందిన సంస్థ ఇచ్చిన ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ ఆ నిర్ణయం తీసుకుందన్నారు.

చంద్రబాబు సెల్ఫ్‌గోల్ ..

బీజేపీతో జత కట్టడమే చంద్రబాబు పతనానికి కారణమవబోతోందని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు సెల్ఫ్‌గోల్ చేసుకున్నాడన్నారు. పవన్‌కళ్యాణ్ తీరు ఉదయం జనసేన, మధ్యాహ్నం బీజేపీ, సాయంత్రం టీడీపీ, రాత్రి మరోపార్టీలా మారిందని విమర్శించారు. జగనన్న పాదయాత్రలో ఎండనక, గాలనక వేల కిలోమీటర్లు నడిచారన్నారు. అయితే పవన్‌కళ్యాణ్ కొన్ని గంటల పాటు తిరగకుండానే వడదెబ్బ అంటూ ఆస్పత్రి పాలై చికిత్స పొందుతున్నాడన్నారు. ఆయనా జగన్ గురించి, పోరాటాల గురించి మాట్లాడేదని ఎద్దేవా చేశారు. బీజేపీ చూస్తే టీడీపీ నుంచి వలస వచ్చిన వారికే ఎక్కువ టికెట్లు ఇచ్చిందన్నారు. కనీసం ఒక సీటైనా గెలుస్తామా? లేదా? అనేలా బీజేపీ పరిస్థితి మారిందన్నారు. రాష్ట్రంలో 60 సీట్లను చంద్రబాబు అమ్ముకున్నాడని ఆరోపించారు. రూ. 3 వేల కోట్లకు పైగా వసూళ్లు చేసుకున్నాడన్నారు. చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడిగా ఘోరంగా విఫలమయ్యాడని ధ్వజమెత్తారు. ఆయనకు జెండా లేదు అజెండా లేదన్నారు. వైఎస్ జగన్ చేపట్టిన సిద్ధం సభలతో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో వణుకు పుట్టిందన్నారు. ఆ తర్వాత చంద్రబాబు చర్యలు, క్రియల వల్ల తెలుగుదేశం పార్టీకి తీరని నష్టం తెచ్చేలా ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఎన్నికల్లో ఉమ్మడి అనంత జిల్లాలో రెండు ఎంపీ, 14 ఎమ్మెల్యే సీట్లు గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
ఆదివారం ॥ 7-4-2024

వైరల్

జీవితం అనే గురువు పాఠాలు, గుణపాఠాలు నేర్పుతుంది



సంజయ్ లీలా భన్సాలి 'హీరామండి– ది డైమండ్ బజార్' వచ్చే నెల నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. 'హీరామండి'లో మనిషా కోయిరాల నటించింది. 'హీరామండి' విడుదలకు ముందు ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో తన జీవితంలోని ప్రధాన సంఘటనల గురించి సుదీర్ఘమైన నోట్ రాసింది మనిషా. క్యాన్సర్‌తో తాను పోరాడిన రోజులను గుర్తు తెచ్చుకుంది.

'ఎన్నో మంచి పాత్రలలో నటించాను. ఎంతో మంది ఉత్తమ దర్శకులతో కలిసి పనిచేశాను. ఎంతోమంది స్నేహాన్ని పొందాను. దేవుడి దయతో క్యాన్సర్‌తో పోరాడి గెలిచాను. జీవితంలో ఎత్తుపల్లాలు ఉంటాయి. నా జీవితంలో ఎన్నో లోతులను చూశాను. జీవితాన్ని మించిన గురువు లేదు. ఎన్నో పాఠాలు, గుణపాఠాలు నేర్పుతుంది. కాలం విలువను తెలుసుకున్నాను' అంటూ రాసింది. మనిషా కోయిరాల రాసిన ఈ నోట్ నెట్‌జనులను బాగా కదిలించింది.

స్కేట్‌బోర్డ్‌పై మనాలి టు కన్యాకుమారి

'మనాలి నుంచి కన్యాకుమారికి ఎలా వెళతాం?' అనే ప్రశ్నకు 'స్కేట్‌బోర్డ్ మీద' అని ఎవరూ చెప్పరు. 'మీరు చెప్పకపోతేనేం... నేనైతే స్కేట్‌బోర్డ్ మీదే వెళ్లాను' అంటున్నాడు రితిక్. ప్రొఫెషనల్ స్కేట్ బోర్డర్ అయిన రితిక్ క్రాడ్జెల్ మనాలి నుంచి కన్యాకుమారికి స్కేట్‌బోర్డ్ మీద వెళ్లాడు.



ఈ ప్రయాణానికి సంబంధించిన వీడియోలు నెట్‌లోకాన్ని అబ్బురపరుస్తున్నాయి.

చిన్న బ్యాక్‌ప్యాక్‌తో బయలుదేరిన రితిక్ 100 రోజుల్లో తన ప్రయాణాన్ని పూర్తి చేశాడు. రీల్స్, వీడియోలలో తనకు ఎదురైన అనుభవాలను నెటిజనులతో పంచుకున్నాడు. గూగుల్ మ్యాప్స్ పనిచేయకపోవడం నుంచి దట్టమైన పొగమంచుతో హైవేల జీరో విజిబిలిటీ వరకు రితిక్‌కు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి.

ఎన్ని సవాళ్లు ఎదురైనా ముందుకే వెళ్లాడు. రితిక్ సాహసం, ఓపికకు నెటిజనులు ప్రశంసల వర్షం కురిపించారు.

చిప్స్ ఉండగా పూల చింత ఏల!

'పెళ్లి ఊరేగింపు కారును దేనితో అలంకరిస్తారు?' అనే ప్రశ్నకు టక్కున వినిపించే జవాబు... పువ్వులు.

పూల కొరతో, ఖర్చు అనుకున్నారో.. వైవిధ్యం కోసమో ఏమో తెలియదుగానీ ఈ పెళ్లి కారును పొటాటో చిప్స్ ప్యాకెట్స్‌తో అలంకరించారు. సత్పాల్ యాదవ్ అనే ఇన్‌స్టాగ్రామ్ యూజర్ పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. చిప్స్‌తో ముస్తాబైన ఈ పెళ్లి కారు గురించి నెటిజనులు సరదాగా స్పందించారు.

'పొటాటో చిప్స్ బ్రాండ్‌ను ప్రమోట్ చేసే పబ్లిసిటీ ఇది'

'చిప్స్ అంటే ఎంత ఇష్టముంటే మాత్రం ఇలానా!'

'చిప్స్‌కు బదులుగా ఫైవ్‌స్టార్ చాక్లెట్స్‌తో ముస్తాబు చేసి ఉంటే కారు వెంట జనాలు పరుగులు తీసేవారు'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.



మా నాయినే! కొబ్బరికాయను తలకేసి కొట్టుకున్నాడు



కొబ్బరికాయను రాయిపై కొడితే పగులుతుంది. నుదుటిపై కొడితే? వైరల్ అవుతుంది! విషయంలోకి వస్తే... తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి కొబ్బరికాయ పట్టుకొని పూజాపీఠం దగ్గర శ్లోకాన్ని జపించాడు. ఆ తరువాత తల పైకి లేపి కొబ్బరికాయను నుదుటి మీద కొట్టుకున్నాడు. 'యాక్షన్‌కు రియాక్షన్' అనేది ప్రకృతి ధర్మం కదా! సదరు వ్యక్తి వెంటనే కుప్పకూలిపోయాడు. ఈ వీడియో వైరల్ కావడం మాట ఎలా ఉన్నా వ్యక్తి చర్యను నెటిజనులు ఖండించారు. 'ఆపరేషన్ సక్సెస్ బట్ పేషెంట్ డెడ్', 'గాయపడింది నువ్వు కాదు... కొబ్బరికాయ'లాంటి సరదా కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

ది గ్రేట్ వడా పావ్ వార్



ఢిల్లీ 'వైరల్ వడా పావ్ గర్ల్'గా పాపులర్ అయిన చంద్రికా గెరా దీక్షిత్ తాజాగా తన ఫుడ్ కార్ట్ సార్టప్‌తో రాత్రికి రాత్రి సెన్సేషన్‌గా మారింది. దీక్షిత్ పాపులారిటీ మాట ఎలా ఉన్నా ఆమెకు పోటీదారులు పెరిగారు. దీక్షిత్ ఫుడ్ కార్ట్ చుట్టుపక్కల పోటీదారులు వడా పావ్ బండ్లను ఏర్పాటు చేస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. 'పాపులారిటీనే కొంపముంచిందా!' లాంటి హెడ్‌లైన్స్ నెటిజనుల నుంచి లైన్ కట్టాయి.

'నిన్న నేను రానందున తన బండిని ఉంచానని ఆంటీ చెప్పింది. ఈరోజు కూడా ఇక్కడే పెట్టింది. ఒకరి వ్యాపారాన్ని దెబ్బతీయాలనుకోవడం సమంజసమా!' అని తన ఆవేదనను వెళ్లగక్కింది దీక్షిత్.

ఫుడ్ వ్లాగర్ ఫూడీ మానేహా ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది.


ఈ వీడియో వైరల్ కావడంతో పోటీదారు ఆంటీ 'ఒకరి వ్యాపారాన్ని దెబ్బ తీసే ఉద్దేశం నాకు లేదు. నా పని నేను చేసుకుపోతున్నాను' అని ఎర్రటి ఎండల్లో కూల్‌గా బదులిచ్చింది. 'బండి ఎవరు పెట్టారనేది కాదు... రుచి ముఖ్యం' అని కూడా సెలవిచ్చింది.

మన తెలుగువాడి బయోపిక్

చూపు లేకపోయినా అంట్రప్రెన్యూర్‌గా విజయం సాధించిన మన తెలుగువాడు శ్రీకాంత్ బొల్లా బయోపిక్ ఫస్ట్‌లుక్ వైరల్ అయ్యింది.
రాజ్ కుమార్ రావు శ్రీకాంత్ పాత్ర పోషిస్తున్నాడు.



శ్రీకాంత్ బొల్లా



శ్రీకాంత్ బొల్లా పాత్రలో రాజ్ కుమార్ రావు

పుట్టుకతో అంధత్వం వెంటాడినా విజయాలు అందుకోవడానికి అది అడ్డుకాదని నిరూపించిన తెలుగు పారిశ్రామికవేత్త శ్రీకాంత్ బొల్లా బయోపిక్ 'శ్రీకాంత్' ఫస్ట్‌లుక్ విడుదలైంది. మంచి నటుడిగా పేరు గడించిన రాజ్‌కుమార్ రావు శ్రీకాంత్ పాత్రను పోషిస్తుండటం విశేషం. మచిలీపట్నంలో జన్మించిన శ్రీకాంత్ బొల్లా ఇంజినీరింగ్ చదువు విషయంలో చాలా సవాళ్లు ఎదుర్కొన్నాడు. అంధుడైన కారణాన ఐఐటీలో సీటు పొందలేకపోయాడు. అయితే పట్టుదలతో మసాచూసెట్స్ యూనివర్సిటీలో తొలి అంతర్జాతీయ అంధ విద్యార్థిగా దఖలయ్యి చదువుకున్నాడు. భారత్‌కు తిరిగి వచ్చి పారిశ్రామిక రంగంలో కీర్తి గడించాడు. బొల్లా జీవితం ఇప్పటికే ఎందరికో ఆదర్శం అయ్యింది. వెండితెర మీద ఆయన జీవితం చూసి మరెందరో స్ఫూర్తి పొందుతారు. తుషార్ హీరానందాని ఈ సినిమా దర్శకుడు.

నగదు మాత్రమే ఇవ్వండి



జేబులో డబ్బులు పెట్టుకోవడం జనం మానేశారు. ఖర్మగాలి ఫోన్ పే పని చేయకపోతే తెల్లముఖాలు వేస్తున్నారు. నగదు లావాదేవీల వల్ల ఎంత ఖర్చవుతున్నదో ఎంత మిగిలి ఉన్నదో తెలిసేది. కాని ఆన్‌లైన్ పేమెంట్లకు హద్దు లేదు. ఈ నేపథ్యంలో చెన్నైలో ఆటో నడిపే ఒక పెద్దాయన తన ఆటోలో పెట్టిన నోటీస్ ఇంటర్‌నెట్‌లో వైరల్ అయ్యింది.
నగదు అవసరాన్ని గుర్తు చేసే పోస్ట్ ఇది.

'జీ పే చేయొద్దు. డబ్బు డ్రా చేయడానికి ఏటీఎం దగ్గర ఆపమని అడగొద్దు' అని చెన్నైలో ఒక ఆటోబాబాయ్ పెట్టిన బోర్డు ఇంటర్‌నెట్‌లో వైరల్ అయ్యింది. గతంలో అందరి దగ్గర డబ్బులుండేవి. ఆటో ఎక్కినా దిగినా డబ్బు ఇచ్చి బేరం ముగించేవారు. ఇప్పుడు అందరూ జీపే, ఫోన్‌పే చేస్తున్నారు. అయితే కొన్ని దుకాణాల్లో ఇప్పటికీ 'నగదు మాత్రమే' అనే బోర్డులు ఉన్నాయి. దానికి కారణం డిజిటల్ లావాదేవీల్లో ఏదైనా మోసం జరుగుతుందేమోనని. ఈ ఆటోబాబాయ్‌కి కూడా అలాంటి అనుభవాలు ఎదురై ఉండొచ్చు. లేదా ఎక్కిన వారు జీపే పని చేయకపోతే ఏటీఎం దగ్గరకు వెళదామని టైమ్ వేస్ట్ చేస్తూ ఉండొచ్చు. అందుకనే స్పష్టంగా 'ఏటీఎం దగ్గర ఆటో ఆపమని అడగొద్దు' అంటూ బోర్డ్ పెట్టాడు. చెన్నైలో ఇతని ఆటో ఎక్కిన మహిళ ఈ బోర్డును ఫొటో తీసి 'ఎక్స్'లో పెడితే ఇంటర్‌నెట్‌లో మంచి డిబేట్ నడిచింది. 'ఇలాగైతే ఎలా' అని కొందరంటే 'బ్యాంకు ట్రాన్సాక్షన్స్ అన్నీ డిజిటల్ పేమెంట్ల వల్ల ప్రభుత్వానికి ఎందుకు తెలియాలి?' అని కొందరు ప్రశ్నించారు. చివరకు ఆటో ఎక్కిన మహిళ తన అపార్ట్‌మెంట్ దగ్గర దిగి, సెక్యూరిటీ దగ్గర అప్పు తీసుకుని ఆటో బాబాయ్‌కి చెల్లించి బతుకు జీవుడా అనుకుంది.

హెల్త్

నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

ఏయే వయసుల్లో ఏయే వ్యాక్సిన్‌లు! ఏయే వైద్య పరీక్షలు..?







ఆరోగ్య సమస్య ఏమైనా వస్తే చికిత్స తప్ప ప్రత్యామ్నాయం లేదు. కానీ సమస్య రాకుండా ముందే నివారించుకుంటే ఆరోగ్యానికి ధోకా ఉండదు. చికిత్స కంటే నివారణే మేలు అనే సూక్తి మేరకు వ్యాధుల నివారణకు ఉపయోగపడే అంశాల్లో మొట్టమొదటి అంశం టీకాలు (వ్యాక్సిన్లు). రెండో అంశం... లక్షణాలు కనిపించగానే చేయించాల్సిన వైద్యపరీక్షలు. నేడు 'వరల్డ్ హెల్త్ డే'. ఈ సందర్భంగా ఏ వయసులో వారు ఏయే వ్యాక్సిన్లు తీసుకోవాలన్న అంశంపై అవగాహన కోసం ఈ కథనం.

టీకాలు

చిన్నారి పుట్టిన వెంటనే... ఓపీవీ, బీసీజీలతో పాటు హెపటైటిస్ బి వ్యాక్సిన్ ఇస్తారు. ఆ తర్వాత 6, 10, 14 వారాల్లో ఇస్తారు).

ఆరు వారాలప్పుడు : ● డీ–ట్యాప్ (డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్) / డీపీటీ టీకా ఫస్ట్ డోస్ ● హెచ్‌ఐబీ (హిబ్) (హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా టైప్ బి) టీకా ఫస్ట్ డోస్ ● ఐపీవీ (ఇనాక్టివేటెడ్ పోలియో వైరస్)/ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) టీకా ఫస్ట్ డోస్ ● పీసీవీ 13 (న్యూమోకోకల్ కాంజుగేట్ టీకా) ఫస్ట్ డోస్ ● రొటావైరస్ టీకా మొదటి డోస్ (ఇది నోటిద్వారా ఇస్తారు) ● హెపటైటిస్–బి వ్యాక్సిన్ రెండో డోస్.

పది వారాలప్పుడు: ● డీ–ట్యాప్ (డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్) / డీపీటీ టీకా రెండో మోతాదు ● హెచ్‌ఐబీ (హిబ్) (హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా టైప్ బి) టీకా రెండో మోతాదు ● ఐపీవీ / ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) టీకా రెండోడోస్ ● పీసీవీ 13 రెండో మోతాదు ● నోటిద్వారా ఇచ్చే రొటావైరస్ టీకా రెండో డోస్ ● హెపటైటిస్–బి మూడో డోస్.

పద్నాలుగు వారాలప్పుడు: ● డీ–ట్యాప్ (డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్) / డీపీటీ టీకా మూడో మోతాదు ● హెచ్‌ఐబీ (హిబ్) (హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా టైప్ బి) టీకా మూడోమోతాదు ● ఐపీవీ (ఇనాక్టివేటెడ్ పోలియో వైరస్)/ ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) టీకా మూడో మోతాదు ● పీసీవీ 13 (న్యూమోకోకల్ కాంజుగేట్ టీకా) మూడో మోతాదు ● రొటావైరస్ టీకా మూడో డోస్ (ఇది నోటిద్వారా ఇచ్చే డోస్) ● హెపటైటిస్–బి వ్యాక్సిన్ నాలుగో మోతాదు.

ఆరు నెలల వయసప్పుడు : ● ఇన్‌ఫ్లుయెంజా టీకా మొదటి మోతాదు ● ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) మొదటి మోతాదు

ఏడు నెలల వయసప్పుడు : ● ఇన్‌ఫ్లుయెంజా టీకా రెండో మోతాదు

తొమ్మిది నెలల వయసప్పుడు : ● ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) రెండో మోతాదు ● ఎమ్ఎమ్ఆర్ (తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా) టీకా ఫస్ట్ డోస్ ● టైఫాయిడ్ కాంజుగేట్ వ్యాక్సిన్ ఇస్తారు.

పన్నెండు నుంచి 15 నెలల వయసప్పుడు: ● ఎమ్ఎమ్ఆర్ (తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా) టీకా రెండో మోతాదు ● వారిసెల్లా (చికెన్‌పాక్స్) టీకా మొదటి మోతాదు ● హెపటైటిస్–ఏ టీకా మొదటి మోతాదు (దీని రెండో డోస్ సాధారణంగా 18 నెలలప్పుడు ఇస్తారు) ● పీసీవీ (ప్యాక్‌డ్ సెల్ వాల్యూమ్) బూస్టర్.

పద్దెనిమిది నెలల వయసప్పుడు : ● డీట్యాప్ టీకా మొదటి బూస్టర్ డోస్ ● హెచ్‌ఐబీ (హిబ్) టీకా మొదటి బూస్టర్ డోస్ ● ఐపీవీ లేదా ఓపీవీ టీకా ● హెపటైటిస్–ఏ రెండో డోస్.

మూడేళ్ల వయసప్పుడు: ● వారిసెల్లా వ్యాక్సిన్ రెండో డోస్ టీకా.

ఐదేళ్లప్పుడు: ● డీ–ట్యాప్ టీకా రెండో బూస్టర్ ● ఐపీవీ టీకా ● ఎమ్ఎమ్ఆర్ టీకా మూడో డోస్.

పది నుంచి పన్నెండేళ్ల వయసప్పుడు: ● హెచ్‌పీవీ టీకా మొదటి డోస్ (దీని రెండు, మూడు డోసులు 9 నుంచి 18 ఏళ్ల వయసప్పుడు) ● టీడ్యాప్ టీకా బూస్టర్ డోస్ ● మెనింగోకోకల్ కాంజుగేట్ టీకా మొదటి డోస్ (దీని బూస్టర్ 16 ఏళ్ల వయసప్పుడు ఇవ్వాల్సి ఉంటుంది).

పదిహేను నుంచి 16 ఏళ్ల వయసప్పుడు: ● మెనింగోకోకల్ కాంజుగేట్ టీకా బూస్టర్ డోస్ ● టీడీ / డీటీ టీకా.

18 నుంచి 65 ఏళ్ల వరకు: ఈ వయసులో ఎవరికైనా మంచి వ్యాధి నిరోధకత ఉంటుంది. గతం లో ఏదైనా వ్యాక్సిన్ తీసుకోకపోతే... డాక్టర్ సలహా మేరకు తీసుకోవచ్చు. వ్యాక్సిన్ తీసుకున్నదీ లేనిదీ గుర్తులేనప్పుడు డాక్టర్‌కు ఆ విషయం చెబితే... వారు కొన్ని పరీక్షల ద్వారా వ్యాక్సిన్ తీసుకున్నదీ లేనిదీ నిర్ధారించి అవసరమైతే ఇస్తారు.

65 ఏళ్లు పైబడిన వారికి: ఈ వయసు దాటాక కొన్ని వ్యాక్సిన్లు తప్పనిసరిగాను, మరికొన్ని అవసరాన్ని బట్టి తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు... ● పీసీవీ–13 అండ్ పీపీఎస్‌వీ 23 అనే వ్యాక్సిన్లను సాధారణంగా 65 ఏళ్లు దాటినవారికి ఇస్తుంటారు. ఇవి నిమోనియాను నివారించే నిమోకోకల్ వ్యాక్సిన్స్‌లు. ఇందులో తొలుత పీసీవీ–13 ఇస్తారు. ఆ తర్వాత రెండు నెలలకు పీపీఎస్‌వీ–23 ఇస్తారు ● టీ–డ్యాప్ వ్యాక్సిన్ : చిన్నప్పుడు తీసుకున్న టెటనస్, డిఫ్తీరియా, పెర్టుసిస్ వ్యాధులను నివారించే వ్యాక్సిన్ తాలూకు బూస్టర్ డోసులను 65 ఏళ్లు పైబడ్డ తర్వాత ప్రతి పదేళ్లకోమారు తీసుకుంటూ ఉండాలి.



డాక్టర్ బీవీఎస్ అపూర్వ
కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్

ముందుగానే కొన్ని వైద్య పరీక్షలు చేయించడం వల్ల కొన్ని వ్యాధుల్ని కనుగొని సంపూర్ణంగా నయం చేసుకోవచ్చు. ఉదాహరణకు సర్వైకల్ క్యాన్సర్ అనే వ్యాధికి సుదీర్ఘమైన ముందస్తు వ్యవధి ఉంటుంది. అంటే అసలు వ్యాధి రావడానికి పదేళ్ల ముందునుంచే 'ప్రీ–సర్వైకల్ పీరియడ్' ఉంటుంది. పాప్ స్మియర్ అనే పరీక్ష ద్వారా వ్యాధి రాబోయే దశాబ్దకాలం ముందుగానే దాన్ని కనుగొనవచ్చు. క్యాన్సర్ ను ఎంత త్వరగా కనుగొంటే అంత తేలికగా నయమవుతుంది. ఆరోగ్యంగా ఉండటం కోసం ముందస్తుగా ఏయే వయసుల్లో ఏయే వైద్యపరీక్షలు ఉపకరిస్తాయో తెలుసుకుందాం.

పరీక్షలు

0 - 10 ఏళ్ల వయసులో: ఈ వయసులో అవసరం అయితే తప్ప పెద్దగా వైద్యపరీక్షలు అవసరం లేదు.

11 - 20 ఏళ్లు : ఇది యుక్త వయసులోకి మారే దశ. నిర్దిష్టంగా ఏవైనా వైద్యసమస్యలు ఉండటం లేదా లక్షణాలు కనిపించడం వంటి సమయాల్లో తప్ప... ఈ వయసులోనూ పెద్దగా వైద్యపరీక్షలు అవసరం పడవు.

20 - 30 ఏళ్లు : ఈ వయసులో కొన్ని లైంగిక సాంక్రమిక వ్యాధులు (ఎస్‌టీఐ'స్) కోసం మరీ ముఖ్యంగా హెపటైటిస్–బీ నిర్ధారణ పరీక్షలు చేయించి హెచ్‌బీఐజీ వ్యాక్సిన్ తీసుకోవాలి. అలాగే అమ్మాయిలైతే పాప్‌స్మియర్ వంటి గైనిక్ పరీక్షలు చేయించుకుని, 12 ఏళ్ల నుంచి 26 ఏళ్ల మధ్యకాలంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ప్రయోజనకరం.

30 నుంచి 40 ఏళ్లు : ఈ వయసు నుంచి డయాబెటిస్ కోసం హెచ్‌బీఏ1సీ అనే రక్తపరీక్షలు, రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలి. ఏవైనా తేడాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి ఈసీజీ, టూ డీ ఎకో, అవసరాన్ని బట్టి ట్రెడ్‌మిల్ వంటి పరీక్షలు చేయించాలి. అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలూ మంచిదే. మహిళలైతే డాక్టర్ సలహా మేరకు బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం మామోగ్రామ్ పరీక్ష చేయించాలి.

40 - 50 ఏళ్లు : ఈ వయసు నుంచి దేహంలో కొన్ని మార్పులు మొదలవుతాయి. అందుకే ఈ వయసులో పరీక్షలు తరచూ చేయిస్తుండటం మేలు. రక్తపోటును తెలుసుకోవడం కోసం సిస్టోల్, డయాస్టోల్ ప్రెషర్స్, రక్తంలో చక్కెర మోతాదుల కోసం హెచ్‌బీఏ1సీతో పాటు అవసరమైతే గ్లూకోస్ టాలరెన్స్ టెస్ట్ (జీటీటీ), పొద్దున్నే పరగడుపున, ఏదైనా తిన్న తర్వాత చేసే ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, పోస్ట్ ప్రాండియల్ వైద్య పరీక్షలతోపాటు అవసరాన్ని బట్టి కొన్నిరకాల క్యాన్సర్ పరీక్షలు చేయించడం మంచిది.

అలాగే మహిళలైతే ఆస్టియోపోరోసిస్ నిర్ధారణ కోసం బోన్ డెన్సిటీ పరీక్ష చేయించాలి. దాంతోపాటు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలను డాక్టర్ చెప్పిన వ్యవధుల్లో చేయించాలి.

ఇక పురుషులైతే ఈ వయసు నుంచి ప్రోస్టేట్ స్పెసిఫిక్ ఏంటీజెన్... సంక్షిప్తంగా పీఎస్ఏ అనే పరీక్షను డాక్టర్లు చెప్పిన వ్యవధుల్లో చేయించుకుంటూ ఉండాలి.

50 - 60 ఏళ్లు : చాలామంది 50 ఏళ్ల వరకు ఎలాంటి పరీక్షలు చేయించకపోవచ్చు. అయితే అలాంటివాళ్లంతా ఈ 50 – 60 ఏళ్ల మధ్యవయసులో తప్పక వైద్యపరీక్షలు చేయించాల్సిన అవసరం తప్పక వస్తుంది. ముందు నుంచి పరీక్షలు చేయించని వాళ్లతోపాటు ఈ వయసులోని అందరూ ఆస్టియోపోరోసిస్ నిర్ధారణ కోసం బోన్ స్కాన్, కోలన్ క్యాన్సర్ నిర్ధారణ కోసం కొలనోస్కోపీ, గుండె జబ్బుల కోసం తరచూ ఈసీజీ, టూ డీ ఎకో, ట్రెడ్‌మిల్ పరీక్షలతో పాటు లక్షణాలను బట్టి ఇతర వైద్యపరీక్షలు చేయిస్తుండాలి.

మహిళలకు 50 ఏళ్ల వయసు తర్వాత మెనోపాజ్ రావడంతో గుండెకు ఉండే ఒక సహజ రక్షణ తొలగిపోతుంది. అందువల్ల గతంలో చేయించినా, చేయించక పోయినా ఈ వయసు నుంచి మహిళలు గుండెకు సంబంధించిన అన్ని స్క్రీనింగ్ పరీక్షలు అంటే ఈసీజీ, టూడీ ఎకో, ట్రెడ్‌మిల్ వంటి పరీక్షలు చేయించాలి.

60 నుంచి 70 ఏళ్లు : ఈ వయసులో వాళ్లనే సీనియర్ సిటిజెన్‌గా పరిగణిస్తుంటారు. పురుషులూ మహిళలు అన్న తేడా లేకుండా... ఈ వయసు నుంచి అందరూ... ఆస్టియోపోరోసిస్ నిర్ధారణ కోసం బోన్ స్కాన్, కోలన్ క్యాన్సర్ నిర్ధారణ కోసం కొలనోస్కోపీ, గుండెజబ్బుల కోసం తరచూ ఈసీజీ, టూ డీ ఎకో, ట్రెడ్‌మిల్ పరీక్షలతోపాటు లక్షణాలను బట్టి మరికొన్ని ప్రత్యేకమైన పరీక్షలు అవసరమవుతాయి.

70+ పైబడ్డాక... ఆపైన కూడా...

ఈ వయసు నుంచి లక్షణాలను బట్టి ఓ వ్యక్తి సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండేందుకు పైన పేర్కొన్న వైద్యపరీక్షలతో పాటు కొన్ని వ్యాక్సిన్లు, మరికొన్ని మందులు తీసుకోవాలి. ఒకవేళ పోషకాహార లోపం ఉంటే, తగిన ఆహారం తీసుకోవాలి. దాంతోపాటు అవసరం అయితే మరికొన్ని హెల్త్ సప్లిమెంట్స్ వంటివి తీసుకోవాల్సి ఉంటుంది.



డాక్టర్ హరికిషన్
సీనియర్ కన్సల్టెంట్
జనరల్ ఫిజీషియన్